క్లుప్తంగా

డీసీసీ ఉపాధ్యక్షుడిగా బంగరి పర్వతాలు



బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన బంగరి పర్వతాలును నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకం అయ్యారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ ఏఐసీసీ పరిశీలకుడు పీవీ మోహన్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణకు బంగరి పర్వతాలు అభినందనలు తెలిపారు.

జనరల్ సెక్రెటరీగా..

లింగాల: మండల కేంద్రానికి చెందిన భాగ్యబాయి మహిళా కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రోహిణిరెడ్డిలు నియామకపత్రం అందజేశారు.

నష్టపరిహారం అందజేత

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన ముగ్గురు రైతులకు చెందిన గొర్రెలు, ఆవుదూడలు గతేడాది అడవి జంతువుల దాడిలో మృతి చెందాయి. ఈ మేరకు ఫారెస్టు ఆఫీసర్ ఫర్విద్ హమ్మద్ శుక్రవారం రైతులకు నష్టపరిహారం అందజేశారు. మల్లేష్‌కు రూ.12వేలు, పెంటయ్యకు రూ.10వేలు, వెంకటయ్య రూ.8వేల చొప్పున నష్టపరిహారం మంజూరైనట్లు ఎఫ్ఆర్ఓ ఫర్విద్ హమ్మద్ తెలిపారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో నర్సరీలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ గంగామోహన్ కోరారు. శుక్రవారం మండలంలోని ఇంద్రకల్‌లో ఆయన నర్సరీలు పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నాణ్యమైన మట్టిని వినియోగించాలని సూచించారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక



ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్లకు చెందిన అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ జక్కా చంద్రశేఖర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి గురువారం రాత్రి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పెనిమిళ్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉప సర్పంచ్ స్వాతి అశోక్‌గౌడ్, మాజీ సర్పంచ్ తిర్పతయ్య, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు అనంతప్రతాప్‌రెడ్డి, కేవీఎన్‌రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, నర్సింహ్మరెడ్డి, విజేందర్‌రెడ్డి, రాజేందర్, రేణయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి..



కొల్లాపూర్: కోడేరు మండలంలోని రాజాపూర్, కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు చెంచుగూడెంకు చెందిన 90 మంది శుక్రవారం ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

మహిళపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని ఈరట్వానిపల్లిలో సుంకరి మల్లమ్మ కిరాణం దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తోంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి మహిళ మద్యం విక్రయిస్తుండగా పట్టుకొన్నారు. ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

'వాస్తవాలే మాట్లాడుతాం'

బిజినేపల్లి: బీజేపీ నాయకులు వాస్తవాలే మాట్లాడుతారని బీజేపీ మండల అధ్యక్షుడు భూషయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ విషయంలో బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి వాస్తవాలే మాట్లాడారని పేర్కొన్నారు. మా నాయకుడు చేసిన వ్యాఖ్యల్లో అవాస్తవం ఉంటే బిజినేపల్లి అంబేడ్కర్ సాక్షిగా టికెట్ విషయంలో కాంగ్రెస్ నాయకులు నిజం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు నారాయణాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



బతుకమ్మలను ఎత్తుకున్న కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు



వెల్దండలో..

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మలను అందంగా తయారుచేసి మురిసిపోయారు. బతుకమ్మల చుట్టూ బొడ్డెమ్మలు ఆడారు. పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. బతుకమ్మ పండుగ విశిష్టతను కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ వివరించారు. అంతకుముందు కళాశాలలో ఫస్టియర్ విద్యార్థులకు స్వాగత కార్యక్రమం ఏర్పాటుచేశారు. పట్టణంలోని న్యూబ్లూమ్స్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు ఆకట్టుకున్నాయి.

అమ్రాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి ఆడి పాడారు. అనంతరం బతుకమ్మను నిమజ్జనం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి విద్యార్థులు, ఆద్యాపకులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద ఉన్న శాస్త్ర ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలను అందంగా పేర్చారు. ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులు ఆట పాటలతో అలరించారు. అనంతరం సమీపంలోని నీటికాల్వలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ రవిజేత, ఉపాధ్యాయుల బృందం తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతపై అవగాహన



తెలకపల్లి: మండలంలోని కార్వంగలో ఏపీజీవీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డ్ సౌజన్యంతో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ పరమేశ్వర్, ఉప సర్పంచ్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చిన్నజంగయ్య, కాశన్న, శ్రీనివాస్‌రెడ్డి, పరశురాముడు, ఆనంద్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాము, వెంకటయ్య, చందు, నారాయణ, కురుమయ్య, మాధవాచారి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగూల గ్రామానికి చెందిన పుల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈవిషయాన్ని గ్రామస్తుడు గణేష్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా రూ.5 వేలు సమకూర్చారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో గణేష్ బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

కొల్లాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఇటీవల కర్నె కురుమయ్య, శివయ్యలు మృతిచెందారు. గ్రామానికి చెందిన కార్పెంటర్ తిరుపాలు బాధిత కుటుంబసభ్యులకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రేగిచెట్టు కురుమయ్య, బిగులు మధు, లక్ష్మి తదితరులున్నారు.

ఎల్లూరులో మెగా హెల్త్ క్యాంపు

కొల్లాపూర్: మండలంలోని ఎల్లూరు గ్రామ సమీపంలో ఉన్న మిషన్ భగీరథ పంపహౌజ్ ఎదుట పెంట్లవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులకు 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మలేరియా, డెంగీ, హెచ్ఐవీ, షుగర్, రక్తపోటు తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏజీఎం ప్రకాష్, మేనేజర్ రమేష్, డాక్టర్లు బాలకృష్ణ, రామ్మోహన్, కిషోర్ పాల్గొన్నారు.

దివ్యాంగులను ఓటుబ్యాంక్‌గా చూడొద్దు



కల్వకుర్తి: దివ్యాంగులను ఓటుబ్యాంక్‌గా చూడటం తగదని ఆ సంఘం రాష్ట్ర నాయకులు సాజిద్‌అలీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అబుబుకర్ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని పథకాలలో 5శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. దివ్యాంగులకు న్యాయం చేసేవారికే వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇస్తామన్నారు. సమావేశంలో దివ్యాంగుల సంఘం నాయకులు శంకర్, యాదయ్య, స్వామి, మల్లేష్, తిరుపతి, శ్రీనివాసులు, శేఖర్, వెంకట్, ఖాద్రి, లింగం, పద్మ, అలివేలు, సౌమ్య, ఆసియా, రజియాలు పాల్గొన్నారు.

రజక సంఘం కమిటీ ఎన్నిక



కల్వకుర్తిరూరల్: పట్టణ రజక సంఘం నూతన కమిటీని శుక్రవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య, రాజు, కోశాధికారిగా బాలు, గోపాల్, ప్రచార కార్యదర్శిగా మల్లేష్, కృష్ణయ్య, కరుణాకర్‌లను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్సీకి ఆహ్వానం



కల్వకుర్తిరూరల్: పట్టణంలో వాసవీకన్యకాపరమేశ్వరి దేవీ నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డికి శుక్రవారం ఆలయ చైర్మన్ రమేష్‌బాబు ఆహ్వాన పత్రం అందజేశారు. ఆయన వెంట జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ ఆనందర్ కుమార్, శ్రీధర్, అశోక్, రాఘవేందర్, శ్రీనివాస్, తర్నికల్ శ్రీను పలువురు పాల్గొన్నారు.

'పార్టీ టికెట్ ఇస్తారని నమ్మకం ఉంది'

కొల్లాపూర్: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే ఇస్తారని నమ్మకం ఉందని ఆ పార్టీ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం తుది వరకు పోరాడుతానన్నారు.

బహుజనుల ఐక్యతతో రాజ్యాధికారం సాధ్యం



ఉప్పునుంతల: బహుజనుల ఐక్యతతో రాజ్యాధికారం సాధ్యమని బీఎస్పీ అచ్చంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోత్కూరి నాగార్జున అన్నారు. శుక్రవారం మండలంలోని మొల్గరలో గడప గడపకు ఏనుగు గుర్తు నినాదంతో ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ అసెంబ్లీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, జాకీర్ ఉస్సేన్, రమేష్ సాహెబ్, కృపానందం, సురేష్, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

వెల్దండ: మండలంలోని కేస్లీతండాలో పాలశీతలీకరణ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుక్రవారం నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బీఎంసీ అధ్యక్షుడు శ్రీనునాయక్, లక్ష్మణ్‌నాయకులు ప్రారంభించారు. మొత్తం 15 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.10వేలు అందిస్తామని తెలిపారు.

15న జిల్లా స్థాయి..

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో ఈ నెల 15న జిల్లా స్థాయి టెన్నీస్‌బాల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా సాయిలింగేశ్వర యూత్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. విజేతలకు మొదటి, రెండో బహుమతులు రూ.20వేలు, రూ.10వేలు అందజేస్తామని వివరించారు. వివరాల కోసం సెల్: 90100814354, 965299430 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నియోజకవర్గ స్థాయి చెస్ టోర్నీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని యూటీఎఫ్ వనంలో బుద్ధ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రమేష్, మల్లేష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అండర్-15, 17 విభాగాలలో పోటీలు ఉంటాయని పేర్కొ న్నారు. మిగతా వివరాలకు సెల్: 80747 17480, 9640488548 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

ఉప్పునుంతల: ఎన్ని కుట్రలు పన్నినా అచ్చంపేటలో బీఆర్ఎస్‌దే విజయం తథ్యమని అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం స్థానిక యశోద ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ మతం పేరిట, కాంగ్రెస్ వారు కులం పేరిట రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. తాను అచ్చంపేట ఎమ్మెల్యేగా వచ్చిన తర్వాతే అన్ని వర్గాల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని చెప్పారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని మరోసారి ఆశీర్వదిస్తే నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కొందరు తాయిలాలకు ఆశపడి పార్టీలు మారుతున్నారన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, నాయకులు రవీందర్‌రావు, గోపాల్‌రెడ్డి, మల్లేష్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ మాట్లాడుతూ సర్వేనెంబర్ 704లో కొంతమంది రైతులకు 1.03 గుంటల భూమి ఉందని ఇందులో ఉన్న నక్షబాటను కబ్జా చేస్తున్నారని వివరించారు. అదేవిధంగా సర్వే నెంబర్ 705లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు పూర్తి విచారణ చేసి కబ్జాకు గురవుతున్న భూములను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి, జోగయ్య, ఎర్రశ్రీను ముదిరాజ్, రమేష్, భరత్ తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని శ్రీశైలం-హైదరాబాద్ రహదారి వెల్టూర్ స్టేజీ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం ఘటన విధితమే. ఈ ఘటనలో వెల్టూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కొండపల్లి నిరంజన్, కుమారుడు సాయిలకు తీవ్రంగా గాయాలయ్యాయి. శుక్రవారం బాధితుడి సోదరుడు మన్ననూర్‌కు చెందిన కొండపల్లి మల్లేష్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్ షాబాద్ మండలం మాచానపల్లి గ్రామ నివాసి కలాల్ సాయివివేక్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొనట్లు ఎస్ఐ తెలిపారు.

సామాజిక తనిఖీ సిబ్బందికి అవగాహన

తాడూరు: సామాజిక తనిఖీ బృందం శుక్రవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహించిన పనులకు సంబంధించిన వివరాలను ఎంపీడీఓ గంగామోహన్ వారికి వివరించారు. 2022 మార్చి 2023 వరకు గ్రామాలలో ఉపాధిహామీ ద్వారా 1297 పనులకుగాను రూ.5 కోట్ల 64 లక్షల ఖర్చు చేశామని పేర్కొన్నారు. పనులను పరిశీలించడంతోపాటు పనులకు సంబంధించిన కొలతలు, రికార్డులు, మస్టర్లు, క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తారని తెలిపారు.

బీజేపీలో చేరిక



కొల్లాపూర్(పెంట్లవెల్లి): మండలంలోని కొండూరులో బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు యేలేని సుధాకర్‌రావు సమక్షంలో శుక్రవారం పలువురు గ్రామ యువకులు చేరారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మండలంలోని ఎంగంపల్లితండా, కొండూరు గ్రామాలలో యువ భరోసా యాత్ర నిర్వహించారు. అనంతరం సుధాకర్‌రావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భరత్‌చంద్ర, వెంకటస్వామి, ఖలీల్, కృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం ముస్తాబు

కల్వకుర్తిరూరల్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని 9 రోజులపాటు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు మౌలికవసతులు ఏర్పాట్లలో నిర్వాహకులు నిమగ్నం అయ్యారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆలయ చైర్మన్ రమేష్‌బాబు కోరారు.

ఆత్మహత్యపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లి గ్రామానికి చెందిన బొజ్జయ్య ఆత్మహత్యపై కుమార్తె అనూష ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భర్కత్‌పల్లి గ్రామానికి చెందిన రైతు బొజ్జయ్యకు అదేగ్రామానికి చెందిన అంజయ్యలకు కొంత కాలంగా భూ వివాద సమస్య కొనసాగుతోంది. గురువారం గ్రామస్తుల సమక్షంలో నిర్వహించిన పంచాయతీలో అన్యాయం జరిగిందని బొజ్జయ్య మానసికక్షోభకు గురయ్యాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విధితమే. బాధితుడి కుమార్తె ఫిర్యాదు మేరకు అంజయ్యపై కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

తపాలాశాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



లింగాల: తపాలాశాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి తపాలా శాఖ అధికారి బీపీ వెంకట్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీసు ఆవరణలో డాక్ కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన సదస్సులో తపాలా సేవలపై అవగాహన కల్పించారు. సేవింగ్స్, బీమా పథకాలు, పీఓఎస్‌బీ, ఐపీపీబీ స్కీమ్‌ల గురించి వివరించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన వ్యక్తి గాగ్ పాలసీ తీసుకొని మృతి చెందడంతో నామినీ మృతుడి భార్య కాశమ్మకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, విక్రమ్, శ్రీనాథ్, ప్రసాద్, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



తాడూరు: కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని నాయకుడు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గోవిందాయిపల్లి, ఎత్మాపూర్‌లో ఆయన పర్యటించారు. పేదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినా, భూకబ్జాలను అడ్డుకున్నా కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్పీటీసీ రోహిణి, కాంగ్రెస్ నాయకులు చందమల్లయ్య, కోటేశ్వర్, నరేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, యత్మాపూర్ సర్పంచ్ కురుమయ్య, ఎల్లయ్య, యాదయ్యగౌడ్, శేకర్, రాములు తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యం నీడలో ప్రభుత్వ పాఠశాలలు



అస్వస్థతకు గురైన ఆశ్రమ పాఠశాల విద్యార్థి(ఫైల్)



ట్రెక్కింగ్ పేరుతో అటవీ ప్రాంతంలో తిరుగుతున్న పీటీజీ విద్యార్థులు(ఫైల్)

మన్ననూర్: కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పిస్తున్నామని పాలకుల మాటలు నీటిమీద రాతలుగానే మిగిలాయి. గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామంటూ అధికారులు, పాలకుల మాటలకు క్షేత్రస్థాయిలో మరోలా ఉంది. శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రమదారిలోని మన్ననూర్ గ్రామంలో నిర్వాహణలో విద్యా సంస్థలు సమస్యలతో కుస్తీ పడుతున్నాయి. నెల రోజుల్లో రెండు సార్లు (సెప్టెంబర్ 14వ, అక్టోబర్ 2వ తేదీ) గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు బారిన పడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తరుచుగా విద్యార్థులు అస్వస్థతకు గురవుతుండటంతో వారి తల్లిదండ్రులు హాస్టళ్ల నుంచి ఇంటికి తీసుకెళ్తున్నారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఈ ఏడాది మార్చి 6వ తేదీన పదర మండలం వంకేశ్వరం గ్రామానికి చెందిన 6వ తరగతి విద్యార్థిని నిఖిత తరగతి గదిలోనే ఉరేసుకోని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో ప్రజా సంఘాలు, ప్రతి పక్షాలు పాఠశాల నుంచి జిల్లా స్థాయి వరకు అనేక రకాలైన ఆందోళనలు చేపట్టాయి. బాలిక మృతి చెంది ఇప్పటికి 6 నెలలు గడుస్తున్నా హత్యా, ఆత్మహత్యా అనే విషయాన్ని అధికారులు, పాలకులు ఇప్పటి వరకు నిర్ధారించలేదు. అదేవిధంగా పీటీజీ పాఠశాల/కళాశాల అటవీ సరిహద్దును పులుల రక్షిత అభయారణ్యం ఆనుకుని ఉంది. గతంలో పలుమార్లు క్రూరమృగ జాతికి చెందిన వన్య ప్రాణులు ఎలుగుబంట్లు పాఠశాల ప్రాంగణంలోకి వచ్చిన దాఖలాలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, పట్టింపు లేమి కారణంగా కొందరు ఉపాధ్యాయులు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

భద్రత కల్పించాలి

వసతి గృహాల్లో విద్యార్థినులకు భద్రత కల్పించాలి. నాణ్యమైన భోజనం అందడం లేదు. ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు విద్యార్థులు అస్వస్థతకు గురైనా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి.

–ఎంఏ రహీం, మండల కోఆప్షన్ సభ్యుడు

అసంపూర్తిగా పార్కు పనులు



పెద్దకొత్తపల్లిలో వసతులు లేక వెలవెలబోతున్న పార్కు

కొల్లాపూర్(పెద్దకొత్తపల్లి): మండల కేంద్రంలో రూర్బన్ మిషన్ పథకంలో పార్కు నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. పార్కులో కనీస వసతుల కల్పనతో పూర్తిగా విఫలం అయ్యారు. అసంపూర్తిగా కాంట్రాక్టర్ పనులు వదిలేయడంతో స్థానికులు పార్కుకు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. చిన్నారుల కోసం ఆటవస్తువులు ఏర్పాటు చేయలేదు. ఊయల కూడా అందుబాటులో లేదు. ప్రస్తుతం పార్కులో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పార్కు నిర్మాణ పనులు పూర్తిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.